# ప్రజాయుద్ధాన్ని–గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం!
# గడ్డు పరిస్థితిని ఎదుర్కొనేందుకు ధీటుగా
# పిఎల్‌జిఏలోని పార్టీ కమిటీలను, కమాండ్లను
# సైద్ధాంతికంగా సన్నద్ధం చేద్దాం!
# ఆపరేషన్ గ్రీన్ హంట్‌ను ఓడిద్దాం!

*పిఎల్‌జిఏ 14వ వార్షికోత్సవాన్ని డిసెంబర్ 2 నుంచి 8 వరకు ఘనంగా జరపాల్సిందిగా యావత్తు పార్టీ శ్రేణులకు, పిఎల్‌జిఏ, ప్రజా మిలీషియా బలగాలకు, విప్లవ ప్రజా ప్రభుత్వాలు, సంఘాల నిర్మాణాలకు సెంట్రల్ మిలటరీ కమీషన్ (సిఎంసి), సి.పి.ఐ. (మావోయిస్టు) పిలుపు!*

**ప్రియమైన కామ్రేడ్స్!**

డిసెంబర్ 2, 2000. భారతదేశంలో మొట్టమొదటిసారిగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో, భారత విప్లవ మహా నాయకులు, మన ఉపాధ్యాయులు కామ్రేడ్స్ చారుమజుందార్, కన్హయ్ చటర్జీల దిశానిర్దేశానికి అనుగుణంగా ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పిఎల్‌జిఏ) ఆవిర్భవించిన చారిత్రాత్మకమైన రోజు. రాబోవు డిసెంబర్ 2న అది తన 14వ వార్షికోత్సవాన్ని జరుపుకోబోతోంది. ప్రస్తుతం మనం మన ఐక్య పార్టీ సి.పి.ఐ. (మావోయిస్టు) పది వసంతాల ఉత్సవాలను జరుపుకుంటున్నాం. అంతర్జాతీయ కార్మికవర్గ సైన్యానికి చెందిన ఒక డిటాచ్‌మెంట్ అయిన మన పార్టీ చేతిలో పదునైన ఆయుధంగా నిలిచి, ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా భారతదేశంలో నూతన ప్రజాస్వామిక వ్యవస్థ స్థాపనకై, మన ప్రియతమ నాయకులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలు కన్నకలల్ని సాకారం చేస్తూ, వేలాది అమరవీరులు చిందించిన రుధిర ధారల బాటలో, కోట్లాది కార్మిక–కర్షక తదితర పీడిత వర్గ ప్రజల అసమాన త్యాగాల చాలులో ప్రజాయుద్ధ మార్గంలో పురోగమిస్తున్న పిఎల్‌జిఏ 14వ వార్షికోత్సవాన్ని డిసెంబర్ 2 నుంచి 8 వరకు ఘనంగా జరపాల్సిందిగా,

ఈ దశాబ్ది కాలంలో అది ప్రజాయుద్ధ పురోగమానికి సాగించిన కృషిని విశాల ప్రజారాశుల్లోకి తీసుకొని వెళుతూ, ప్రజలపై యుద్ధం–'ఆపరేషన్ గ్రీన్ హంట్'ను ఓడించే లక్ష్యంతో ప్రజలను ప్రజాయుద్ధంలోకి పెద్దెత్తున సంఘటితం చేయాల్సిందిగా సెంట్రల్ మిలటరీ కమీషన్ (సిఎంసి), సి.పి.ఐ. (మావోయిస్టు) యావత్తు పార్టీ శ్రేణులకు, పిఎల్‌జిఏ, ప్రజా మిలీషియా బలగాలకు, విప్లవ ప్రజా ప్రభుత్వాల, సంఘాల నిర్మాణాలకు పిలుపునిస్తోంది.

గత డిసెంబర్ నుంచి ఇప్పటి వరకూ సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి మద్దతుతో, వారి నిర్దేశత్వంలో భారత పాలకవర్గాలు తీవ్రతరం చేసి కొనసాగిస్తున్న దేశవ్యాప్త ఫాసిస్టు బహుముఖ దాడి, ప్రజలపై యుద్ధం– 'ఆపరేషన్ గ్రీన్ హంట్'కు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతూ 90 మందికి పైగా (అఖిల భారత–2, బీహార్–ఝార్ఖండ్–29, దండకారణ్యం–46, ఆంధ్ర–ఒడిశా బార్డర్–9, ఒడిశా–1, తెలంగాణ–1, ఆంధ్రప్రదేశ్–3, గుజరాత్–1, కేరళ–1, పశ్చిమబెంగాల్–1) మన దేశ పీడిత జన ఉత్తమ పుత్రికలు, పుత్రులు అమూల్యమైన తమ ప్రాణాలను అర్పించారు. ఇందులో 13 మంది మహిళలు. భారత విప్లవానికి చిరకాలంగా నేతృత్వం వహించి దాన్ని దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో పురోగమింపజేయడంలో అనుపమాన కృషిని సాగించిన మన పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సుశీల్ రాయ్, సిసిఎం కామ్రేడ్ రవూఫ్‌లు; సీనియర్ కామ్రేడ్స్ కరదమ్ భట్ (గుజరాత్), సినోజ్ (కేరళ); సీనియర్ మహిళా కార్యకర్తలు కామ్రేడ్స్ గజ్జల సరోజన, శాంతక్క; గోందియా డివిజన్ (డికె) డివిసిఎం కామ్రేడ్ లాల్సూ వంటి కామ్రేడ్స్ ప్రజాయుద్ధంలో తమ వంతు పాత్రను నిర్వహిస్తూ తుది శ్వాస విడిచారు. విప్లవ, పౌరహక్కుల ఉద్యమాల నాయకులు, మేధావులు కామ్రేడ్స్ సునీతి కుమార్ ఘోష్, ఎంటి ఖాన్‌లు తుది వరకూ పీడిత ప్రజల విముక్తికై దృఢంగా నిలిచి వృద్ధాప్యంతో కన్నుమూయగా, ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమ నాయకుడు ఆకుల భూమయ్యను రాజ్యం హత్య చేసింది. ఈ సంవత్సర కాలంలో అమరులైన వారిలో దాదాపు 30 మంది కామ్రేడ్స్ శత్రువు సాగిస్తున్న మోసపు యుద్ధం – బూటకపు ఎదురుకాల్పులు, విప్లవ ప్రతీఘాతుక దాడులలో అమరులు కాగా; శత్రువు సాగించిన నరమేధాలలో 20 మందికి పైగా ప్రజలు బలయ్యారు. దాదాపు 30 మంది కామ్రేడ్స్ శత్రు బలగాలతో జరిగిన హోరాహోరీ పోరాటాలలో సాహసోపేతంగా పోరాడుతూ అమరులయ్యారు. ఇద్దరు కామ్రేడ్స్ శత్రు బలగాలపై పిఎల్‌జిఏ నిర్వహించిన దాడులలో వీరోచితంగా కొట్లాడుతూ తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. జైళ్లలో అమానవీయ పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడుతూ కొంతమంది, ప్రాణాంతక వ్యాధుల బారిన, ఇతర ప్రమాదాల బారిన పడి కొంతమంది అంతిమ శ్వాస విడిచారు.

ఇదే కాలంలో, ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా ఫిలిప్పైన్స్, టర్కీ, బంగ్లాదేశ్, పెరూలలో; సామ్రాజ్యవాద దేశాలలోని కార్మికవర్గ విప్లవోద్యమాలలో; సామ్రాజ్యవాద దురాక్రమణ దాడికి గురైన దేశాలలో, ఇతర దేశాలలో సాగుతున్న జాతి విముక్తి పోరాటాలలో; ప్రపంచవ్యాప్తంగా అన్ని రకాల అభివృద్ధినిరోధకులకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాలలో అనేక మంది కామ్రేడ్స్ ప్రపంచవ్యాప్తంగా

తమ ప్రాణాలను ధారపోశారు.

సిఎంసి, సిపిఐ (మావోయిస్టు) ఈ అమరులందరికీ పిఎల్‌జిఏ 14వ వార్షికోత్సవం సందర్భంగా తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తోంది. ఈ ప్రజా వీరులు మృత్యుంజయులు. మనం ఎల్లప్పుడూ ఈ ప్రజా వీరుల పట్ల, అమరవీరుల పట్ల అత్యంత గౌరవాన్ని ప్రదర్శించాలి. వారు అందించిన స్ఫూర్తితో వారు వదిలివెళ్లిన కర్తవ్యాలను పరిపూర్తి చేయడానికి వారి ఆశయాలను, ఆదర్శాలను ఎత్తిపట్టాలి. వాళ్ల పోరాటం, త్యాగం, విజయాలు మనకు నిరంతరం ఉత్తేజాన్నిస్తాయి. వారందించిన ఉత్తేజంతో, వారి ఆకాంక్షలను, వారు కన్న కలల్ని నెరవేర్చడానికి దృఢసంకల్పంతో పోరాడుతామని పిడికిలి బిగించి శపథం చేస్తోంది. అమరుల మహోన్నత, నిస్వార్ధపూరిత ఆశయాల పరిపూర్తికై పునరంకితం కావాల్సిందిగా పిలుపు నిస్తోంది.

అంతేకాక సమర రంగాన శత్రువుతో పోరాడుతూ గాయపడిన కామ్రేడ్స్ అందరూ త్వరగా కోలుకొని తిరిగి యుద్ధరంగంలోకి ఉత్సాహంగా దూకాలని సిఎంసి ఆకాంక్షిస్తోంది. పోరులో వారు ప్రదర్శించిన ధైర్యసాహసాలకు విప్లవాభినందనలు తెలియజేస్తోంది.

కామ్రేడ్స్! విప్లవోద్యమంలో త్యాగాలు అనివార్యమైనవే అయినప్పటికీ ఈ సంవత్సర కాలంలో జరిగిన కొన్ని నష్టాలు నివారించగలిగేవే. రహస్య పని విధానాన్ని, గెరిల్లా యుద్ధ సూత్రాలను అమలు చేయడంలో జరిగిన పొరపాట్ల వల్ల ఇలాంటి నష్టాలు జరుగుతున్నాయి. వీటిని అధిగమించడానికి పార్టీ, పిఎల్‌జిఏ పై నుంచి కింది వరకూ కృషి చేయాల్సిన అవసరం ఉంది.

**ప్రియమైన కామ్రేడ్స్!**

దేశంలో విప్లవోద్యమం పురోగమిస్తూ ఒక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఆవిర్భంచడాన్ని సహించలేని దోపిడి పాలకవర్గాలు దానిని సమూలంగా నిర్మూలించడం కోసం, తమ నూతన సరళీకృత ఆర్థిక విధానాలను అడ్డూఆపూ లేకుండా అమలు చేయడం కోసం సామ్రాజ్యవాదుల ప్రోద్బలంతో గత ఐదు సంవత్సరాల నుండి కొనసాగిస్తున్న 'ప్రజలపై యుద్ధం' ఆపరేషన్ గ్రీన్ హంట్ రెండవ దశను ఈ సంవత్సర కాలంలో మన పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఏ బలగాలు తీవ్రంగా ప్రతిఘటించాయి. ప్రజా మిలీషియా, ప్రజల మద్దతుతో విప్లవోద్యమాన్ని, పార్టీ నాయకత్వాన్ని పరిరక్షించుకుంటూ ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేసేందుకు తీవ్రంగా కృషి చేశాయి.

ముఖ్యంగా తుపాకుల నీడలో లోక్‌సభ ఎన్నికల తంతును నిర్వహించేందుకై శత్రు బలగాలు సాగించే దాడులను బూటకపు ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్ సందర్భంగా వివిధ గెరిల్లాజోన్లలో మన పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఏ బలగాలు ప్రజలను, ప్రజా మిలీషియాను సంఘటితం చేస్తూ ఎదుర్కొన్నాయి. ఉద్యమం బలంగా ఉన్న ప్రాంతాలలో ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌ను విజయవంతం చేయడంలో తమ వంతు పాత్రను నిర్వహించాయి. ఎన్నికలకు ముందూ, ఆ తర్వాతా అనేక ఎత్తుగడల ఎదురుదాడులను నిర్వహించాయి. విప్లవోద్యమంపై కత్తిగట్టిన కొంతమంది రాజకీయ

నాయకులను నిర్మూలించాయి. గెరిల్లా జోన్లలో ప్రజాపునాదిపై ఆధారపడి శత్రు ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ఏరివేసేందుకు కృషి చేశాయి. విప్లవ ప్రతీఘాతుక టిపిసి, సల్వాజుడుం వంటి వాటి నాయకులపై, గూండాలపై దాడులు చేసి నిర్మూలించాయి. ఈ మొత్తం కాలంలో బీహార్, ఝార్ఖండ్, దండకారణ్యం (ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర), ఒడిశా, ఏఓబి, తెలంగాణలలో కొన్ని పెద్ద చర్యలతో పాటు, దాదాపు 60 మధ్య, చిన్న రకం దాడులు నిర్వహిస్తూ శత్రు బలగాలకు కునుకులేకుండా చేశాయి.

బీహార్‌లో ముగ్గురు పోలీసులను నిర్మూలించి, ఠాణేదార్‌తో సహా ఎనిమిది మందిని గాయపరిచిన బరండా మోడ్ (ఔరంగాబాద్) ఘటనలో బూబీట్రాప్ ఎత్తుగడలను పిఎల్‌జిఏ సమర్థవంతంగా అమలు జరిపింది. ఝార్ఖండ్‌లో బస్సులో పోలింగ్ పార్టీని, సామగ్రిని తీసుకెళుతున్న పోలీసులపై మైన్లు పేల్చి 5 గురు పోలీసులను నిర్మూలించి, అనేక మందిని గాయపరిచిన ఫరసాగావ్ (దుమ్కా) ఆంబుష్, దండకారణ్యంలో రోడ్డు ఓపెనింగ్ పూర్తి చేసుకొని పిరికితనంతో ఆంబులెన్స్‌ను కవర్‌గా చేసుకొని వాపస్ వెళుతున్న సిఆర్‌పిఎఫ్ బలగాలపై మైన్లు పేల్చి మొత్తం ఆర్ఓపిని దెబ్బతీసిన (ఆరుగురు మరణించగా, నలుగురు గాయపడ్డారు) కామానార్ (సుక్మా) ఆంబుష్, గస్తీ నుంచి వాపస్ వస్తున్న పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని లక్ష్యంగా చేసుకొని మైన్లు పేల్చి మొత్తం గస్తీ పార్టీని దెబ్బతీసిన (ఏడుగురు మరణించారు, నలుగురు గాయపడ్డారు) ముర్మురి (గడ్చిరోలి) ఆంబుష్‌లలో పిఎల్‌జిఏ మైన్ యుద్ధ తంత్రాన్ని అద్భుతంగా అమలు జరిపింది. విప్లవ ప్రతీఘాతక టిపిసి బలగాల వెంటబడి సాహసోపేతంగా 16 మంది టిపిసి గూండాలను నిర్మూలించిన ఛోటీకొరియా (పలామూ) ఆంబుష్ టిపిసిని కంగుతినిపించింది. దండకారణ్యంలో 40 మందికి పైగా ఉన్న, కాలినడకన వస్తున్న పోలీసు రోడ్ ఓపెనింగ్ పార్టీపై జాతీయ రహదారిపై మైదాన ప్రాంతంలో దాడి చేసి సగం కంటే ఎక్కువ మందిని నష్టపరిచిన (15 మంది మరణించగా, 10 గాయపడ్డారు) టాహకవాడ (సుక్మా) ఆంబుష్ శత్రువును బెంబేలెత్తించింది. ఈ ఆంబుష్‌లో పిఎల్‌జిఏ బలగాలు దృఢ సంకల్పంతో ధైర్యసాహసాలను, టెక్నిక్‌ను, వేగాన్ని, ఆక్యురేట్ షూటింగ్ సమర్థవంతంగా వినియోగించడం ద్వారా విజయాన్ని సాధించాయి. కామానార్ ఆంబుష్‌లో చుట్టూ పోలీసు క్యాంపుల వలయం ఉన్నా, ఆంబుష్ టీం అత్యంత రహస్యంగా ఉంటూ, చివరికి ఆంబుష్ సైట్ వద్ద కందకాలు తవ్వుకొని రహస్యంగా ఉండి ఆంబుష్‌ను విజయవంతం చేసింది. వీటన్నింటినీ పెద్ద చర్యలుగా చెప్పుకోవచ్చు.

ఇదే కాలంలో ఝార్ఖండ్‌లో ఇద్దరు పోలీసులను నిర్మూలించి, 15 మందిని గాయపరచిన పీర్‌టాండ్ (గిరిడీ) ఆంబుష్, బీహార్‌లో ఇద్దరు సిఆర్‌పిఎఫ్ జవాన్లను నిర్మూలించి, ఆరుగురిని గాయపరచిన గంతి (జముయీ) ఆంబుష్, ఇద్దరు సిఆర్‌పిఎఫ్ జవాన్లను నిర్మూలించి, ఏడుగురిని గాయపరచిన బాబా మందిర్ (జముయీ) ఆంబుష్, దండకారణ్యంలో ఒక సిఆర్‌పిఎఫ్‌కు చెందిన ఒక అసిస్టెంట్ కమాండెంట్‌తో సహా ఇద్దరు జవాన్లను నిర్మూలించి 12 మంది గాయపరచిన బోదిరాస్ (సుక్మా) ఆంబుష్, మోటార్ సైకిళ్లపై వచ్చే రోడ్డు ఓపెనింగ్ పార్టీపై సర్‌ప్రైజ్‌గా దాడి చేసి ఠాణేదార్‌తో సహా ఐదుగురు పోలీసులను నిర్మూలించి, ముగ్గురిని గాయపరిచిన సాంగిడీ–కుటేపాల్ (దంతేవాడ) ఆంబుష్,

ముగ్గురు కోబ్రా కమాండోలను నిర్మూలించి, ఒక డిప్యూటీ కమాండెంట్‌తో సహా ఐదుగురిని గాయపరచిన చింతగుప్ప (సుక్మా) ఆంబుష్, ఒక సి-60 కమాండోను నిర్మూలించి, ఐదుగురిని గాయపరచిన ఆశ (గడ్చిరోలి) ఆంబుష్ వంటి మధ్య రకం చర్యలతో పాటు, దాదాపు 50 వరకూ చిన్న రకం చర్యలు, బూబీట్రాప్ పేలుళ్లు, చికాకుపరిచే చర్యలు జరిగాయి.

పిఎల్‌జిఏ యాక్షన్ టీములు వారాంతపు సంతలలో ఒంటరిగా తిరిగే పోలీసు జవాన్ల వెంటబడి వారి బలహీనతలను వినియోగించుకొని అనేక మందిని నిర్మూలించాయి. వారి వద్ద ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఆక్యురేట్ షూటింగ్‌లో నైపుణ్యాన్ని సాధిస్తూ కొన్ని పిఎల్‌జిఏ టీములు పోలీసులపై సమర్థవంతంగా దాడులు నిర్వహిస్తున్నాయి. వ్యూహాత్మక ప్రాంతాల్లోకి, గెరిల్లా జోన్లలోకి చొరబడే శత్రు సంయుక్త కూంబింగ్ దళాలపై మాటుగాచి దాడులు చేశాయి. ఈ ప్రాంతాల్లోకి అడుగు పెడితే నెత్తురు చిందకుండా క్షేమంగా వెళ్లడం సాధ్యం కాదనే వాతావరణాన్ని కొన్ని చోట్ల సృష్టిస్తున్నాయి.

ఇవే కాక పిఎల్‌జిఏ బలగాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, బహుళ జాతి కంపెనీల, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల ఆస్తులపై పదుల సంఖ్యలో విధ్వంసక చర్యలు నిర్వహించి పదుల కోట్ల రూపాయల నష్టాన్ని కలిగించాయి. రాజ్యహింసకు వ్యతిరేకంగా ప్రజలను, ప్రజా మిలీషియాను సంఘటితపరిచి ప్రజా ప్రతిఘటనోద్యమాన్ని పెంపొందించాయి. పోలీసుల దాడులు, అక్రమ అరెస్టులు, మహిళలపై పోలీసుల అత్యాచారాలు, ప్రజల ఆస్తుల విధ్వంసం-లూటీకి వ్యతిరేకంగా, పోలీసు క్యాంపులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ, నూతనంగా నిర్మించే పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా వీలైన అన్ని పద్ధతులలో నిరాయుధంగా, సాయుధంగా ప్రజలు ప్రతిఘటించారు. హర్రా కోడేర్ ప్రజా ప్రతిఘటన (తూర్పు బస్తర్, దండకారణ్యం) నిరాయుధంగా పెద్దెత్తున ప్రజలు, ప్రత్యేకించి మహిళలు సామూహికంగా పోలీసులను సాంఘికంగా బహిష్కరిస్తూ నిరాయుధంగా, శాంతియుతంగా సాగించి నూతనంగా ఏర్పరచిన పోలీసు క్యాంపును ఎత్తివేసేలా చేసిన ఉద్యమానికి ఒక నమూనాగా నిలుస్తుంది. అదే విధంగా ఎన్నికల సందర్భంగా వేలాది మంది ప్రజలు, ప్రజా మిలీషియా కదిలి రకరకాల పద్ధతులలో వేలాది సాంప్రదాయక ట్రాపులను (గుంతలు, మేకులు నాటిన చెక్కబల్లలు, సారించిన విల్లంబులు) తవ్వి/అమర్చి, ఆ ఉచ్చులలో ఇరికించి అనేక మంది శత్రు బలగాలను గాయపరిచి చికాకుపరిచారు.

మొత్తం మీద ఈ సంవత్సరం కాలంలో పిఎల్‌జిఏ శత్రు బలగాలపై సాగించిన ఎత్తుగడల ఎదురుదాడులలో, ఎత్తుగడల ఎదురుదాడి క్యాంపెయిన్ (టిసిఓసి)లలో 70 మందికి పైగా కిరాయి పోలీసు, కమాండో, అర్ధసైనిక మూకలు మట్టికరవగా, 132 మంది గాయపడ్డారు. సుమారు 53 ఆయుధాలు, 5 వేల తూటాలు, ఇతర సైనిక సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. 90 మందికి పైగా ప్రజా వ్యతిరేకులను, విప్లవ ప్రతీఘాతక శక్తులను, గూండాలను నిర్మూలించాయి.

అలాగే దేశవ్యాప్తంగా పోలీసుల చేత అక్రమంగా నిర్బంధించబడి జైళ్లలో బంధించబడిన వేలాది మంది మావోయిస్టు రాజకీయ ఖైదీల విడుదల కోసం దేశవ్యాప్తంగా అనేక నిరసన ప్రదర్శనలు జరగడంతో పాటు, జైళ్లలో కూడా రాజకీయ ఖైదీలు పోరాటాలను క్రమక్రమంగా తీవ్రతరం చేస్తున్నారు. వివిధ రాష్ట్రాలలో అనేక సెంట్రల్, జిల్లా జైళ్లలోని మావోయిస్టు ఖైదీలు విడి విడిగానూ, సమన్వయంతో ఏకకాలంలోనూ న్యాయమైన డిమాండ్లపై పెద్దయెత్తున ఆందోళనా కార్యక్రమాలను చేపట్టి జైలు అధికారులతో పోరాటాలు సాగిస్తున్నారు. రాజకీయ ఖైదీల హక్కుల వారాన్ని, దినాలను పాటించారు. అనేక రాష్ట్రాలలో బంద్‌లు నిర్వహించారు.

దేశవ్యాప్తంగా వివిధ ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలలోనూ, గెరిల్లా జోన్లలోనూ నిరంతరాయంగా పిఎల్‌జిఏ గెరిల్లా చర్యల ఫలితంగా విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించాలనే శత్రు ఆపరేషన్ గ్రీన్ హంట్ రెండవ దశ లక్ష్యం నెరవేరకుండా పోయింది. దీనితో శత్రువు గ్రీన్ హంట్ మూడవ దశకు సన్నాహాలు పూర్తి చేసుకుంటూ మరో పెద్ద దాడికి పథకాలు రూపొందించుకుంటున్నాడు.

మన విప్లవోద్యమం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికీ, దేశవ్యాప్తంగా విప్లవోద్యమాన్ని అణచివేయడానికి పాలకవర్గాలు కొనసాగిస్తున్న ఫాసిస్టు ఆపరేషన్ గ్రీన్ హంట్‌ని తిప్పికొడుతూ ఉద్యమాన్ని ముందుకు తీసుకొనిపోయే క్రమంలో అనేక మంది మన ప్రియతమ కామ్రేడ్స్ తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించిన ఫలితంగా, మన యావత్తు పార్టీ, పిఎల్‌జిఏ, ప్రజా నిర్మాణాలు, లక్షలాది మంది పీడిత ప్రజలు కొనసాగించిన ప్రజాయుద్ధం ఫలితంగా మనం ఈ సంవత్సర కాలంలో కింది విజయాలను సాధించాం : 1) సిపిఐ (మావోయిస్టు), సిపిఐ (ఎం-ఎల్) నక్సల్బరీ ఒకే పార్టీగా విలీనం అయ్యాయి. 2) శత్రువును ప్రతిఘటిస్తూ ఉద్యమాన్ని కాపాడుకోగలిగాం. చిన్న, మధ్య, కొన్ని పెద్ద ఎత్తుగడల ఎదురుదాడుల ద్వారా శత్రు బలగాలను ఒక మేరకు నష్టపరచగలిగాం. 3) లోక్‌సభ ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్, అందులో భాగంగా సాగిన పిఎల్‌జిఏ ప్రతిఘటన విజయవంతమయ్యాయి. 4) గెరిల్లాజోన్లలో, ఇతర ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలలో వివిధ ఆర్థిక, రాజకీయ సమస్యలపై ప్రజా ఆందోళనలు కొనసాగుతున్నాయి. 5) విప్లవ ప్రజా కమిటీల నిర్మాణం, విస్తరణ కొనసాగింది. అవి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. 6) పార్టీని, పిఎల్‌జిఏను బోల్షివీకరించే క్యాంపెయిన్‌లో భాగంగా అధ్యయన తరగతులు నిర్వహించడం, తప్పులను సరిదిద్దుకునే కృషి కొనసాగుతున్నది. రాజకీయ-సైనిక శిక్షణ, నూతన రిక్రూట్‌మెంట్‌కు ప్రయత్నాలు జరుగుతున్నాయి. 7) శత్రు మానసిక యుద్ధాన్ని తిప్పికొట్టడం కోసం విప్లవ ప్రచారం ఒక మేరకు కొనసాగించాం.

## శత్రు దాడి పథకం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక పక్క గత రెండు-మూడు సంవత్సరాలలో మావోయిస్టు హింస గణనీయంగా తగ్గిపోయిందనీ, కొన్ని ప్రాంతాలలో నక్సలిజాన్ని పూర్తిగా లేకుండా చేశామనీ ప్రకటనలు

చేస్తూనే, మరో పక్క ఇప్పటికీ 'దేశ అంతర్గత భద్రత'కు వామపక్ష తీవ్రవాదమే ఏకైక అతిపెద్ద ముప్పు అంటూ మన ఉద్యమ ప్రాంతాలలో పారామిలటరీ, కమాండో, ప్రత్యేక పోలీసు బలగాల మోహరింపును పెద్దయెత్తున పెంచుతున్నాయి. వీటి ద్వారా నూతన పోలీసు క్యాంపులను గెరిల్లాజోన్లలోనూ, ఉద్యమం విస్తరిస్తున్న/విస్తరించే అవకాశం ఉన్న ప్రాంతాలలోనూ ఏర్పాటు చేస్తున్నాయి. ఉదాహరణకు, గత సంవత్సర కాలంలో దండకారణ్యంలో 30 కొత్త పోలీసు క్యాంపులు ఏర్పాటు చేశాయి. ఒడిశాలో ఆరు నూతన క్యాంపులు ఏర్పాటు చేశాయి. కార్పెట్ సెక్యూరిటీని మరింత పటిష్టం చేస్తున్నాయి. పోలీస్‌స్టేషన్లను, క్యాంపులను ఫోర్టిఫైడ్ చేస్తున్నాయి. పోలీసు క్యాంపులపై మావోయిస్టు గెరిల్లాల సర్‌ప్రైజ్ దాడులను నివారించేందుకు వారి కదలికలను పసిగట్టే విధంగా గ్రౌండ్ సెన్సర్ వ్యవస్థలను నిర్మాణం చేయాలని నిర్ణయించాయి. పోలీసు బలగాలకు కోల్ట్ 7.62, కోల్ట్ 5.56 వంటి అమెరికా ఆధునిక ఆయుధాలు అందించడం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయి.

పిఎల్‌జిఏ పెద్దెతున్న అమలు చేస్తున్న మైన్ యుద్ధ తంత్రాన్ని దెబ్బతీయడం కోసం బాంబు డిస్పోజల్ స్క్వాడ్లను ఆధునిక సూట్లు, సామగ్రితో సాయుధం చేస్తున్నాయి. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలన్నింటా ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్ ప్రాతిపదికన ప్రత్యేక కమాండో బలగాలను అభివృద్ధి చేయడం కోసం మరిన్ని నూతన పోలీసు శిక్షణా కేంద్రాలను తెరుస్తున్నాయి.

యుద్ధ ప్రాతిపదికన రోడ్లు, బ్రిడ్జిలు, 1800 మొబైల్ టవర్ల నిర్మాణంపై కేంద్రీకరిస్తున్నాయి. వీటి నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు ముందుకు రానిచోట పోలీసు బలగాలే వాటిని నిర్మాణం చేయడం మొదలు పెట్టాయి. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో పనిచేస్తున్న భద్రతా బలగాలు వేగంగా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు మొబైల్ ఫోన్ నెట్‌వర్క్‌లు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహించే బలగాలకు 3,500 శాటిలైట్ ఫోన్లను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మావోయిస్టులకు సప్లైలు అందకుండా అన్ని రకాల మార్గాలను మూసివేసేందుకు తీవ్రంగా కేంద్రీకరిస్తున్నాయి.

దేశంలోని తూర్పు, మధ్య, దక్షిణ–పశ్చిమ రాష్ట్రాలలోని లోతట్టు ప్రాంతాలలో ఎడతెరపి లేకుండా కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్లు, రాష్ట్రాల సరిహద్దులలో కనీసం నెలకు ఒకసారి జాయింట్ ఆపరేషన్లు, కూంబింగ్ ఆపరేషన్లు మరింత తీవ్రతరం చేశాయి. ఏ మాత్రం సమాచారం తెలిసినా పెద్దెత్తున ఆపరేషన్లు నడుపుతున్నాయి. ఈ ఆపరేషన్లలో స్వంత బలగాల భద్రత కోసం, మావోయిస్టు గెరిల్లాల ఆచూకీ కోసం డ్రోన్ల వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. పోలీసు ఇన్‌ఫార్మర్ల నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తున్నాయి. 2013 డిసెంబర్ 26 నుంచి 2014 జనవరి 1 వరకు తొమ్మిది రాష్ట్రాలలో 40 వేల అదనపు అర్ధసైనిక బలగాలు, రాష్ట్ర పోలీసు బలగాలతో మొట్టమొదటి దేశవ్యాప్త ప్రత్యేక అణచివేత క్యాంపెయిన్‌ను వారం రోజుల పాటు నిర్వహించాయి. ఇలాంటి రెండవ అణచివేత క్యాంపెయిన్‌ను 2014 మార్చి 19 నుంచి 27 వరకు సుమారు ఒక లక్ష అర్ధసైనిక బలగాలు, ఆరు వేల కమాండో బలగాలు, 4 ఇజ్రాయిల్ ఏరోన్ గూఢచర్య విమానాలు, రాడర్లతో కూడిన అనేక మైన్‌ప్రూఫ్ వాహనాలు,

70 మంది పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్స్ (ఐజిపి) నేతృత్వంలో మావోయిస్టు ఉద్యమం క్రియాశీలంగా ఉన్న ఆరు రాష్ట్రాలలో నడిపాయి. తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాల సరిహద్దుల్లో మునుపెన్నడూ లేనివిధంగా మావోయిస్టుల అణచివేతకు పథకాల రూపకల్పన, ఆధునిక టెక్నాలజీ వినియోగం, పోలీసు బలగాలకు ప్రత్యేక శిక్షణ, సర్చింగ్ ఆపరేషన్లు పెరిగాయి. ఉదాహరణకు, కేరళలో పోలీసులకు పొలారీస్ ఆల్ టెర్రయిన్ ఆఫ్–రోడ్డు వాహనాలను సమకూర్చారు. పోలీసు బలగాలకు అస్సాల్ట్ డాగ్ యూనిట్లను కేటాయిస్తున్నారు. ఈ విప్లవ ప్రతీఘాతక క్యాంపెయిన్ల లక్ష్యం విప్లవోద్యమాన్ని అణచివేయడం, ప్రజలలో తెల్ల బీభత్సాన్ని వ్యాపింపజేయడం.

ప్రజాసంఘాల, మిలీషియా కార్యకర్తలను, సాధారణ ప్రజలను పెద్దయెత్తున అరెస్టులు చేస్తూ, అక్రమ కేసులు మోపి జైళ్లకు పంపుతున్నారు. ప్రత్యేకించి, పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాన్ని నిర్మూలించేందుకు కేంద్రీకరిస్తూనే గ్రామస్థాయి నాయకత్వాన్ని దెబ్బతీసేందుకు బూటకపు ఎన్‌కౌంటర్లకు, విచ్చలవిడి కాల్పులకు పూనుకుంటున్నారు. విప్లవ ప్రజానీకానికీ, శ్రేణులకు స్ఫూర్తిని అందిస్తున్న మన ప్రియతమ అమరవీరుల స్థూపాలను పెద్దెత్తున ధ్వంసం చేస్తున్నారు. వైమానిక దాడులకు (హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా) రంగం సిద్ధం అవుతోంది. హెలిప్యాడ్లు, విమానాశ్రయాలు యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నారు. నిజానికి ఈ దాడి లక్ష్యం ప్రజలు ప్రజాయుద్ధం ద్వారా నిర్మించుకుంటున్న ప్రత్యామ్నాయ విప్లవ ప్రజా ప్రభుత్వాలను ధ్వంసం చేయడం, సామ్రాజ్యవాదుల, బహుళ జాతి కంపెనీల దోపిడీకి మార్గాన్ని సుగమం చేయడం తప్ప మరొకటి కాదు. ఉదాహరణకు, ఛత్తీస్‌గఢ్‌లో దల్లీ రాజహరా–రావ్‌ఘాట్–జగ్దల్‌పూర్ రైలు మార్గాన్ని నిర్మించి రావ్‌ఘాట్ గనుల తెరవడం కోసం మోహరిస్తున్న పది బెటాలియన్ల కేంద్ర అర్ధసైనిక బలగాల ఖర్చులు పూర్తిగా బహుళ జాతి కంపెనీలే భరించేలా ఒప్పందం కుదుర్చుకోవడం.

విప్లవోద్యమాన్ని అణచివేసే లక్ష్యంతో ఉద్యమ ప్రాంతాలన్నింటా సరండా, సుక్మా, బీజాపూర్ నమూనాలను దేశవ్యాప్తంగా విస్తరిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణలను తీవ్రతరం చేస్తున్నాయి. జనజాగరణ్ మేళాలు, పోలీసు సద్భావనా యాత్రలు, జనమైత్రి, సహపంక్తి భోజనాలు, గాంధీయన్ పోలీసింగ్, సివిక్ యాక్షన్ ప్రోగ్రాములను విస్తృతం చేస్తున్నాయి. మావోయిస్టుల వల్ల అభివృద్ధి కుంటుపడుతోందని పెద్దెత్తున ప్రచారం చేస్తున్నాయి. పోలీసు, అర్ధసైనిక, సైనిక బలగాలోకి, ఇతర ప్రభుత్వోద్యోగాలలోకి భర్తీ చేసుకోవటం కోసం రోజ్‌గార్ మేళాలు నిర్వహిస్తున్నాయి. లైవ్‌లీహుడ్ కాలేజీలు పెద్దెత్తున ఏర్పాటు చేసే పేరుతో, నిరుద్యోగ భృతి పేరుతో యువతను ఆకర్షించాలని ప్రయత్నిస్తున్నాయి. ఎల్.ఐ.సి. వ్యూహంలో భాగంగా మొత్తం ప్రభుత్వ యంత్రాంగం విప్లవ ప్రతీఘాతక భూమికను పోషించేలా పునర్వ్యవస్థీకరిస్తున్నాయి. నూతన కేంద్ర హోం మంత్రి రాజనాథ్ సింగ్ నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో భద్రత–అభివృద్ధి పథకాలు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కింద పనిచేసే యూనిఫైడ్ కమాండ్ పరిధిలోకి తీసుకువస్తూ ఆదేశాలు జారీ చేశాడు.

ప్రజా వ్యతిరేకులతో విప్లవ ప్రతీఘాతుక సంస్థలను ఏర్పాటు చేయడం కొనసాగుతున్నది. ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లోని జశ్‌పూర్ జిల్లాలో మరో మావోయిస్టు వ్యతిరేక ఉద్యమాన్ని, ఏఓబిలోని మల్కన్‌గిరిలో మల్కన్‌గిరి ఆదివాసీ సంఘంను ఏర్పాటు చేసి మావోయిస్టు వ్యతిరేక పోస్టర్ క్యాంపెయిన్ ప్రారంభించాయి. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో పోలీసులు 'శోధ్‌యాత్ర'లను నడుపుతున్నారు.

ప్రజాయుద్ధ మార్గంలో ప్రజలు సాధిస్తున్న విజయాలను వమ్ము చేసేందుకై దోపిడి పాలకవర్గాలు 'లొంగుబాటు విధానం'లో మార్పులు తీసుకొని వస్తూ దాన్ని ఒక ప్రముఖ ఎత్తుగడగా ముందుకు తీసుకొని వచ్చాయి. పార్టీలో, పిఎల్‌జిఏలో పై స్థాయి నుంచి సాధారణ ప్రజల వరకూ విప్లవ మార్గం నుంచి వేరు చేసి దిగజార్చడానికి అత్యంత నీచమైన పద్ధతులకు ఒడిగడుతున్నాయి. దండకారణ్యంలో పోలీసు యంత్రాంగం పోలీసు చేతనా నాట్య మంచ్‌ను నిర్మాణం చేసి మావోయిస్టు వ్యతిరేక సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నది. లొంగుబాటు ద్వారా చేకూరే బానిసత్వాన్ని 'కుశహాల్ జిందగీ'గా అభివర్ణిస్తూ ప్రజలను పక్కదారి పట్టించేందుకు దోపిడి ప్రభుత్వ యంత్రాంగం మొత్తం రంగంలోకి దిగి గోబెల్స్ ప్రచార హోరును సృష్టిస్తోంది. మానసిక యుద్ధాన్ని తీవ్రతరం చేస్తున్నది. పెద్ద పెద్ద రంగుల పోస్టర్ల ద్వారా మావోయిస్టు ఉద్యమంపై బురద జల్లుతున్నది. మావోయిస్టు పార్టీ నాయకుల తలలకు వెలలను 25 కోట్ల రూపాయల వరకూ పెంచివేశారు. ప్రజలలో దురాశను సృష్టించి విప్లవానికి వ్యతిరేకంగా ప్రతీఘాతక విప్లవాన్ని వ్యాపింపజేసి సమూలంగా విప్లవాన్ని నిర్మూలించడమే దీని లక్ష్యం.

ఇటీవల లోక్‌సభ ఎన్నికలలో నూతనంగా అధికారంలోకి వచ్చిన మోడీ నాయకత్వంలోని బిజెపి–ఎన్‌డిఏ ప్రభుత్వం వెంటనే నక్సల్ ప్రభావిత రాష్ట్రాల ఉన్నతాధికారులతో రెండు సమావేశాలు జరిపి అనేక కీలకమైన నిర్ణయాలు తీసుకుంది. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్లలో హెలికాప్టర్లను ఉపయోగించడం, మరిన్ని బెటాలియన్ల కేంద్ర అర్ధసైనిక బలగాలను మోహరించడం ఇందులో ముఖ్యమైనవి. ఇప్పటికే నాలుగు నాగా బెటాలియన్లను ఛత్తీస్‌గఢ్‌లో మోహరించింది. అది దేశంలో 'ఉగ్రవాదాన్ని', 'వేర్పాటు వాదాన్ని', ప్రత్యేకించి 'వామపక్ష తీవ్రవాదాన్ని' అరికడతామని ప్రకటించింది. ఆపరేషన్ గ్రీన్ హంట్ మూడవ దశకు సన్నాహాలను పూర్తి చేసుకునేందుకు చర్యలు చేపట్టింది. నక్సల్ ప్రాంతాలలో పనిచేసేందుకు ఐపిఎస్ అధికారులను ఆకర్షించేందుకు, పోలీసు బలగాల మనోబలాన్ని పెంచేందుకై ముందస్తు ప్రమోషన్లు, ప్రత్యేక నగదు పురస్కారాలు, కోరిన చోట పోస్టింగులు, ఇతర సౌకర్యాలను ఇస్తామని ప్రకటించింది. దేశంలో 'వికాస్'ను సాధించడానికి విదేశీ ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం కోసం 'శాంతియుత వాతావారణం' నెలకొల్పడం అవసరమని వక్కాణించింది. అంటే ప్రజలకు తక్షణం అందించాల్సిన కూడు, గుడ్డ, గూడు గురించి గాలికి వదిలి, నిత్యావసర వస్తువుల ధరలను ఆకాశానికి విడిచిపెట్టి వారిపై తూటాలు కురిపించేందుకు వేలాది సాయుధ బలగాలను పంపిస్తున్నది ఈ ఎన్‌డిఏ ప్రభుత్వం. ఉద్యమిస్తున్న ప్రజలపై, వారి నాయకత్వంపై అది 'వికాస్' పేరుతో ఫాసిస్టు దాడులను మరింత ఉన్నత, విస్తృత స్థాయిలో తీవ్రతరం చేసేందుకు

సమాయత్తమవుతోంది.

**కామ్రేడ్స్!**

మన విప్లవోద్యమం గడ్డు పరిస్థితిని, కష్ట కాలాన్నీ ఎదుర్కొంటోంది. మునుపెన్నడూ ఎదుర్కోని సవాళ్లను నేడు మనం ఎదుర్కొంటున్నాం. మన పార్టీ సిసి 4వ మీటింగ్‌లో, వివిధ రాష్ట్ర/స్పెషల్ ఏరియా/స్పెషల్ జోన్ ప్లీనాలలో ఈ పరిస్థితిని సమీక్షించి ప్రస్తుతం ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లను, సమస్యలను గుర్తించాం. వీటిని ఎదుర్కొనేందుకు మన పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఏ దృఢ సంకల్పంతో పూనుకోవాల్సిన అవసరం ఉంది. అది తనను తాను గట్టిపరుచుకోవడం కోసం ఒక సమగ్ర వ్యూహంలో భాగంగా ప్రతి ఏరియాకు నిర్దిష్ట ఎత్తుగడలు, పథకం రూపొందించుకోవాలి. దీనికి అనుగుణ్యంగా ప్రజలను చైతన్యపరచాలి. ప్రజలకు సేవ చేసే కార్యక్రమాలలో పిఎల్‌జిఏ చురుగ్గా పాల్గొనాలి. ప్రతి ఇల్లూ ప్రజాయుద్ధంలో భాగస్వామ్యం అయ్యేటట్లు చేయాలి. ప్రజలను ప్రజా మిలీషియాలో సంఘటితం చేయాలి. ప్రజా మిలీషియాను చురుకుగా పనిచేసేటట్లు, అందుబాటులో ఉన్న ఆయుధాలతో (రైఫిళ్లు, భర్మార్లు, మైన్లు, గ్రెనేడ్లు తదితరములతో) సాయుధం చేయాలి. దీనికోసం ప్రత్యేక కృషి చేయాలి. ప్రచారం, వర్గ పోరాటం, ప్రజాయుద్ధం–గెరిల్లాయుద్ధం, నిర్మాణం, అధ్యయనం ప్రతి రోజూ జరగాలి. రాజకీయంగా చొరవను తమ చేతిలో ఉంచుకుంటూ ప్రతిదీ యుద్ధం కోసం ఎలా సమీకరించుకోవాలో సృజనాత్మకంగా ఆలోచించాలి. వీటిని సమన్వయించుకోవడం కోసం తగిన పని విధానాన్ని రూపొందించుకోవాలి. వివిధ రకాల ప్రజా మిలీషియా యూనిట్లు, ఎల్‌ఓఎస్‌లు, ఎల్‌జిఎస్‌లు, ప్లాటూన్లు, కంపెనీలు, గెరిల్లా బెటాలియన్లు తమ తమ రాజకీయ, సైనిక కర్తవ్యాలను చురుకుగా అమలు పరిచేటట్లుగా ఎదగాలి. అవి నిరంతరం ఏదో ఒక కమ్యూనిస్టు కార్యకలాపంలో నిమగ్నమై ఉండాలి. చురుకైన కార్యకలాపాలు లేకుండా మకాములకు పరిమితమై ఉండరాదు. ప్రజలలో రాజకీయ, సైనిక, నిర్మాణ, పోరాట కృషి చేయడానికి, ప్రజా కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొనడానికి ఉత్సాహాన్ని ప్రదర్శించాలి.

పిఎల్‌జిఏ బలగాలలో సంఖ్యను కాపాడుకునేందుకు శ్రద్ధ వహించాలి, సంఖ్యను మరింత పెంచుకొనే విధానాన్ని అనుసరించాలి. కఠినమైన రాజకీయ–సైనిక శిక్షణను అభివృద్ధిపరుచుకోవాలి. ఈనాటి గడ్డు స్థితిలో వాస్తవిక పరిస్థితులపై ఆధారపడాలి. చొరవను ప్రదర్శించాలి. కష్టాలు ఎదురైనప్పుడు వాటిని భరిస్తూ ఓపికతో పనిచేయాలి. పార్టీ తీసుకున్న నిర్ణయాలను విజయవంతంగా అమలు చేయడం కోసం సృజనాత్మకతను ప్రదర్శించాలి. అనంతరం ఆచరణను సమీక్షించాలి. తగిన గుణపాఠాలు తీసుకొని కార్యాచరణలో అభివృద్ధిని సాధించాలి. పిఎల్‌జిఏ తన మార్క్సిజం– లెనినిజం–మావోయిజం సైద్ధాంతిక పునాదిని పెంచుకోవడం ద్వారా అది నిరంతరం నూతన ప్రజాస్వామిక విప్లవం లక్ష్యం కోసం, అంతిమంగా సోషలిజం–కమ్యూనిజం కోసం స్థిరంగా పోరాడాలి. తన అనుభవాలను మావోయిస్టు గెరిల్లా యుద్ధ సూత్రాలకు జోడించడం ద్వారా తన జ్ఞానాన్ని శాస్త్రీయ జ్ఞానంగా మలుచుకోవాలి.

# పిఎల్‌జిఏ పోరాట కర్తవ్యాలు

**1. ప్రజాయుద్ధాన్ని–గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధిపరిచే క్రమంలో ఎదుర్కొనే సంక్లిష్టమైన సమస్యలతో వ్యవహరించగలిగే విధంగా పిఎల్‌జిఏలోని పార్టీ కమిటీలను, కమాండ్లను, పోరాటయోధులను సైద్ధాంతికంగా, నిర్మాణపరంగా, సైనికపరంగా సన్నద్ధపరచాలి.**

పిఎల్‌జిఏలో బలహీనతలు చాలా లోతుగా ఉన్నాయి. పిఎల్‌జిఏలోని పార్టీ కమిటీలు, కమాండ్ల ప్రధాన బలహీనత – మన సిద్ధాంతాన్ని లోతుగా అర్థం చేసుకోవడంలో, పార్టీ మౌలిక డాక్యుమెంట్ల, ముఖ్యంగా వ్యూహం–ఎత్తుగడల సారాన్ని గ్రహించడంలో, వీటిని మనం పనిచేస్తున్న ప్రాంతాలలో సాగిస్తున్న ప్రజాయుద్ధానికి లేక గెరిల్లా యుద్ధానికి, నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించడంలో లోపభూయిష్టత. ఈ సైద్ధాంతిక, రాజకీయ లోపం వల్ల ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకొని వెళ్లడానికి అవసరమైన సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించడంలో, ముందుకు వస్తున్న సమస్యలను పరిష్కరించడంలో తగిన సామర్థ్యాన్ని అవి ప్రదర్శించలేకపోతున్నాయి. అంటే నిర్దిష్ట పరిస్థితులపై (ప్రజల పరిస్థితి, టెర్రయిన్, శత్రు పరిస్థితిపై) పట్టు ఉండడం లేదు. అందువల్ల అవి నిర్దిష్ట లక్ష్యాలను నిర్ణయించుకోలేకపోతున్నాయి. పరిస్థితులకు తగిన విధంగా కఠిన రాజకీయ–సైనిక శిక్షణ యివ్వలేకపోతున్నాయి. శాస్త్రీయ రాజకీయ–మిలటరీ స్పృహను పెంచుకోలేకపోతున్నాయి. సైనిక క్రమశిక్షణను సడలిస్తున్నాయి. స్థానిక పరిస్థితులపై ఆధారపడి యుద్ధ వనరులను సమీకరించలేకపోతున్నాయి. ఆయుధాలను, మందుగుండును, పేలుడు పదార్థాలను సురక్షితంగా ఉంచుకోలేకపోవడం–దాచుకోలేకపోవడం వల్ల అవి పాడైపోయే స్థితి ఏర్పడుతున్నది. ప్రజలపై ఆధారపడడం అంటే ఏమిటనేది అర్థం కాకపోవడం వల్ల వారి సహకారాన్ని సంపూర్ణంగా వినియోగించుకోలేకపోతున్నాయి. ఈ లోపాల నుండి బయటపడేసి ఈ రోజు మనం ఎదుర్కొంటున్న అత్యంత కఠినమైన పరిస్థితుల మధ్యలోనే ప్రజాయుద్ధాన్ని స్వతంత్రంగా నడిపే బలమైన, ప్రతిభావంతమైన రాజకీయ–సైనిక కమిటీలు, కమాండ్లను, పోరాట యోధులను, ప్రజా మిలీషియాను, మొత్తం పిఎల్‌జిఏను సంఘటితం చేయడానికి పై స్థాయి పార్టీ కమిటీలు, కమీషన్లు, కమాండ్లు చైతన్యవంతంగా పథకం ప్రకారం శ్రద్ధ వహించాలి.

**2. దేశవ్యాప్తంగా పెరుగుతున్న శత్రు బహుముఖ దాడిని ప్రతిఘటించడంలో అత్యంత ముఖ్యమైన కర్తవ్యం ప్రజలను రాజకీయంగా చైతన్యపరచడం–సమీకరించడం.**

శత్రు 'అభివృద్ధి' 'బూటకపు సంస్కరణల' ప్రభావానికి లోనుకాకుండా వాడి సైనిక దాడిని తిప్పికొడుతూ చైతన్యవంతంగా, సృజనాత్మకంగా పీడిత ప్రజల నిజమైన అభివృద్ధి కోసం పోరాడేటట్లు ప్రజల వర్గ చైతన్యాన్ని పెంచడం కోసం కృషి చేయాలి. శత్రు మానసిక యుద్ధాన్ని తిప్పికొట్టే విధంగా, దాని ప్రభావానికి గురికాకుండా ఉండేలా మన ప్రచార, ఆందోళనా కార్యక్రమాలు ఉండాలి. కష్టాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని, వీరోచితమైన పోరాట స్ఫూర్తిని ప్రజలలో

పెంపొందింపజేయాలి. యింకొక వైపు మన పిఎల్‌జిఏ బలానికి, శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా ఎత్తుగడలపరమైన ఎదురుదాడుల క్యాంపెయిన్లను చేపట్టడం ద్వారా మాత్రమే నేడున్న పరిస్థితులలో మనం మన బలగాలను రక్షించుకుని శత్రు బలగాలను నాశనం చేయగలుగుతాం. దీనికోసం మారుతున్న పరిస్థితుల్లో మన రాజకీయ–సైనిక పంథా పైనా, మారుతున్న శత్రు పథకాలు, దగాకోరు ఎత్తుగడలు, జిత్తులమారి పద్ధతులు, కోవర్టు పద్ధతులు, లొంగుబాటు పథకాలు వగైరాల పైనా ఎప్పటికప్పుడు పిఎల్‌జిఏ కమాండర్లకు, పోరాటయోధులకు సైద్ధాంతిక–రాజకీయ అవగాహనను అందించాలి. తద్వారా వారి మొత్తం సంసిద్ధతను, జాగరూకతను, వేగాన్ని, రహస్యాన్ని, చలనశీలతను, దృఢ సంకల్పాన్ని, ఆత్మరక్షణ–దాడి ఎత్తుగడలను అభివృద్ధిపరచాలి. తద్వారా పార్టీని, పిఎల్‌జిఏను, విప్లవ ప్రజా రాజ్యాధికార అంగాలను, విప్లవ ప్రజా సంఘాలను, విప్లవోద్యమాన్ని శత్రు దాడుల నుండి రక్షించుకోవడం ద్వారా ఎత్తుగడల ఎదురుదాడులను నిర్వహించడంలో నైపుణ్యాన్ని సంపాదించుకోవాలి.

**3. వాస్తవిక పరిస్థితులను లోతుగా అర్థం చేసుకునేందుకు నిర్దిష్ట అధ్యయనాన్ని చేపట్టాలి.**

నిర్దిష్ట అధ్యయనం చేయకుండా ఏ విషయంపై అయినా వాస్తవిక అవగాహనకు రావడం సాధ్యం కాదు. వాస్తవాలతో సంబంధం లేకుండా తీసుకునే నిర్ణయాలు స్వీయాత్మకంగా ఉంటాయి. నేల విడిచి సాము చేస్తాయి. పరిస్థితులలో వస్తున్న మార్పులను (ప్రజల స్థితిగతులు, శత్రు పరిస్థితి, టెర్రయిన్ స్థితి) పసిగట్టడం ద్వారా సరియైన సమయంలో శత్రు బలహీనతలను ఉపయోగించుకొని తగిన చర్య తీసుకోవడం సాధ్యమవుతుంది. ఇందుకు కావాల్సిన నైపుణ్యం సులభంగా లభ్యమయ్యేది కాదు. మార్పులను తెలుసుకోవడానికి సంసిద్ధత, లోతైన పరిశీలన వల్లనే ఈ శక్తిని మనం సాధించగలుగుతాం. దీని ద్వారా చొరవను మన చేతిలో నిలుపుకుంటూ శత్రు బలహీనతలను పసిగట్టగలుగుతాం. భౌతిక పరిస్థితులకు తగిన విధంగా సమగ్రమైన ప్లాన్ రూపొందించుకోగలుగుతాం. స్పాంటేనిటీకి, యథాలాపానికి గురికాకుండా ఉండగలుగుతాం. గెరిల్లా పోరాటం పట్ల ఉన్న తేలిక భావాన్ని వదిలించుకోగలుగుతాం. సన్నాహాల సమస్యను, ప్లాన్‌ను తయారు చేసుకునే సమస్యను అధిగమించి యుద్ధ చర్యలను, టిసిఓసిలను విజయవంతం చేసేలా కృషి చేయగలుగుతాం. నేటి గడ్డు పరిస్థితిని అధిగమించాలంటే మన పార్టీ కమిటీలు, కమాండ్లు ఈ విషయంపై అత్యంత శ్రద్ధ వహించడం అవసరం.

**4. ప్రజాయుద్ధానికి ప్రజా పోరాటాలను సమర్థవంతంగా ముడిపెట్టాలి**

ప్రజాయుద్ధంతో పాటే ప్రజల కష్టాలు, కన్నీళ్లకు కారణమైన దైనందిన, మౌలిక సమస్యలపై అత్యంత శ్రద్ధతో ప్రజా పోరాటాలను చేపట్టాలి. భూస్వామ్యానికి వ్యతిరేకంగా 'దున్నేవారికే భూమి' ప్రాతిపదికన వ్యవసాయ విప్లవ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలి. ఇందులో భూమిలేని, పేద రైతులపై ఆధారపడుతూ తప్పనిసరిగా మధ్యతరగతి రైతుల ప్రయోజనాలను కూడా కాపాడాలి.

ప్రజల ఉత్పత్తిని పెంచే, వారి సంక్షేమాన్ని పట్టించుకునే కార్యక్రమాలను పథకం ప్రకారం చేపట్టడం ద్వారా పీడిత ప్రజల జీవన స్థాయిని, కొనుగోలు శక్తిని పెంపొందింపజేయాలి. కేవలం స్థానిక ఆర్థిక సమస్యలపైనే కాకుండా దేశంలోనూ, అంతర్జాతీయంగానూ ముందుకు వస్తున్న రాజకీయ సమస్యలపై పోరాటాలను చేపట్టేందుకు కేంద్రీకరించాలి. వీటికి అనుగుణంగా ప్రచార, ఆందోళన, నిర్మాణ రూపాలను చేపట్టాలి. సామ్రాజ్యవాదులు, వారి దళారీ పాలకవర్గాలు కార్మిక–కర్షక, మధ్యతరగతి ప్రజానీకానికి వ్యతిరేకంగా ముందుకు తీసుకొస్తున్న దోపిడి విధానాలకు వ్యతిరేకంగా రాజకీయ పోరాటాలను చేపట్టాలి. వీటిని వర్గ పోరాటంతో సమన్వయించాలి. ప్రజా పోరాటాలను ఆర్థికవాద చైతన్యంతో కాకుండా రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకొనే ప్రజాయుద్ధానికి తోడ్పడే విధంగా సమన్వయించి నడపాలి. అవి ప్రజాయుద్ధాన్ని మరింత బలోపేతం చేయాలి. తద్వారా అవి మిలిటెంట్ ప్రజా ప్రతిఘటనా పోరాటాలుగా అభివృద్ధి చెంది ప్రజాయుద్ధంలో భాగమవుతాయి.

**5) శత్రు ఇన్‌ఫార్మర్–కోవర్టు నెట్‌వర్క్‌ను ధ్వంసం చేస్తూ అమరత్వాలు, అరెస్టుల ద్వారా ప్రత్యేకించి పై నుండి కింది వరకూ జరుగుతున్న నాయకత్వ నష్టాలను తగ్గించుకోవాలి. లొంగుబాట్లను అరికట్టాలి, విద్రోహుల ఆట కట్టించాలి.**

ఇన్‌ఫార్మర్–కోవర్టు నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడం అనేది ప్రజాపునాదిపై ఆధారపడి కొనసాగించాలి. ప్రజలకు సంబంధం లేకుండా చేపట్టే ఇలాంటి కార్యక్రమం మనం ప్రజలను దూరం చేసుకునేందుకు దారితీస్తుంది. ప్రజల్ని భాగస్వాములను చేయడం ద్వారా నాయకత్వ నష్టాలను గణనీయంగా తగ్గించికోవచ్చు. అయితే నాయకత్వం వైపు నుండి అమలు చేయాల్సిన టెక్నికల్ నియమాలను, గెరిల్లా యుద్ధ సూత్రాలను ఎటువంటి సడలింపులకు తావులేకుండా అమలు చేయాలి. అలా చేయకుండా నష్టాలను తగ్గించుకోలేం.

పార్టీలో, పిఎల్‌జిఏలో లొంగుబాటు ధోరణిని, పారుబోతుతనాన్ని అరికట్టేందుకు విప్లవ రాజకీయాలను, విప్లవోద్యమ అనుభవాలను బోధించేందుకు శ్రద్ధ వహించాలి. కార్మికవర్గ విప్లవ రాజకీయాలే ప్రజా విముక్తికి ఏకైక మార్గమని ఒకసారి నిర్ణయించుకున్న తర్వాత, ఆ రాజకీయాల కోసం శత్రువుకు లొంగిపోకుండా తుది నెత్తుటి బొట్టు వరకూ పోరాడాలనే విప్లవ రాజకీయ దృఢత్వాన్ని పార్టీ శ్రేణులలో, పిఎల్‌జిఏ బలగాలలో పెంపొందింపజేయాలి. విప్లవోద్యమానికి ద్రోహం చేసి శత్రువు పంచన చేరిన విద్రోహుల ఆటకట్టించేందుకు ప్రత్యేకంగా కేంద్రీకరించాలి. తమ ప్రజలకు ద్రోహం చేయడం అత్యంత నీచమైనదని ప్రచారం చేస్తూ, వారి విద్రోహ కార్యకలాపాలను, వారి నిజస్వరూపాన్ని ప్రజలలో ఎప్పటికప్పుడు బహిర్గతం చేయాలి. ప్రజా ప్రయోజనాలను తుంగలో తొక్కే విద్రోహ కార్యకలాపాలను ప్రజలు అసహ్యించుకునేలా చేస్తూ, వారి వర్గ చైతన్యాన్ని పెంపొందింపజేస్తూ దీన్ని ఒక ప్రజా ఆందోళనగా అభివృద్ధి చేయాలి. బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో భాగంగా ఈ విషయం పట్ల పార్టీ, పిఎల్‌జిఏ శ్రేణుల, ప్రజల చైతన్యాన్ని పెంచాలి.

## సెంట్రల్ మిలటరీ కమీషన్ పిలుపు :

### ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!

దేశీయ, అంతర్జాతీయ వస్తుగత పరిస్థితులు మునుపెన్నటికన్నా విప్లవానికి అనుకూలంగా మారుతున్నాయి. 2008లో సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ ప్రపంచవ్యాపిత సంక్షోభంలోకి కూరుకుపోయిన తరువాత ప్రపంచంలో మౌలిక వైరుధ్యాలు పదునెక్కుతున్నాయి. సామ్రాజ్యవాదుల నూతన సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా సామ్రాజ్యవాదులకు – పీడిత జాతులకు, పీడిత ప్రజలకు మధ్య వైరుధ్యం రోజురోజుకు తీవ్రమవుతున్నది. ధనికులకూ పేదలకూ మధ్య అగాధం పెరిగిపోతోంది. గత పదేళ్లలో ప్రపంచంలో కోటీశ్వరుల సంఖ్య 58 శాతం, మల్టీ మిలియనీర్ల సంఖ్య 71 శాతం పెరిగాయి. దీంతో నయావలస, అర్ధవలస, అర్ధభూస్వామ్య దేశాలలో సామ్రాజ్యవాదులకు, వారి దళారీ/తొత్తు పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు పెంపొందుతున్నాయి. పెట్టుబడిదారీ దేశాలలో పెట్టుబడిదారీవర్గానికి వ్యతిరేకంగా కార్మికవర్గం పెద్దయెత్తున ఆందోళనలు చేపడుతున్నది. ఇరాక్‌లో బలపడుతున్న జాతీయ విముక్తి ఉద్యమం సామ్రాజ్యవాదులకు పెనుసవాలు అయ్యింది. పశ్చిమ ఆసియాలో తమ దోపిడీ ప్రయోజనాల కోసం సామ్రాజ్యవాదులు అమెరికా నాయకత్వంలో 50కి పైగా సామ్రాజ్యవాద, వారి దళారీ దేశాలతో కూటమిని ఏర్పర్చి ఇరాక్ గెరిల్లాలపై పెద్దయెత్తున వైమానిక బాంబు దాడులకు పూనుకోవడంతో అక్కడ తిరిగి యుద్ధ వాతావరణం ఏర్పడింది. 'ఇస్లామిక్ టెర్రరిజాన్ని' రూపుమాపే పేరుతో సామ్రాజ్యవాదులు జనావాస ప్రాంతాలపై వైమానిక బాంబు దాడులు చేస్తూ ఇరాక్, సిరియా ప్రజలను ఊచకోత కోస్తున్నారు. వారి ఇళ్లను, ఆస్తులను విధ్వంసం చేస్తున్నారు. ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్ల ప్రతిఘటన తీవ్రతరం అవుతుండడంతో అమెరికా నేతృత్వంలోని నాటో బలగాలను అక్కడ పూర్తిగా ఉపసంహరించడం సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. గాజాపై ఇజ్రాయిల్ తాజా దాడిని బహిర్గతం చేస్తూ పాలస్తీనా జాతి విముక్తి పోరాటకారులు వీరోచితంగా తిప్పికొడుతున్నారు. పర్యావరణం సమస్యపై ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన ప్రపంచ దేశాల మహాసభ ఎదుట ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల నుంచి ఉద్యమకారులు సంఘటితమై పర్యావరణ విధ్వంసం వెనుక సామ్రాజ్యవాదుల కుట్రలను మరోసారి బహిర్గతం చేశారు. మరో వైపు సామ్రాజ్యవాదుల మధ్య తీవ్రతరమవుతున్న వైరుధ్యాలకు యుక్రెయిన్ ఒక కేంద్రంగా మారింది. రష్యా, చైనాలు బ్రిక్స్ సంస్థను బలోపేతం చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో చైనాకూ జపాన్, అమెరికా సామ్రాజ్యవాదులకూ మధ్య వైరుధ్యాలు మరింత తీవ్రతరమవుతున్నాయి.

మన దేశంలో 'వికాస్' కోసం 'సుపరిపాలన' నినాదంతో నూతనంగా పగ్గాలు చేపట్టిన మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం తన వంద రోజుల పాలనలో ప్రతీ సమస్యకూ ఏదోక సూత్రాన్ని ప్రబోధిస్తూ (మోడీ ఫార్ములాలతో) కుప్పిగంతులు వేస్తూ వచ్చింది. దేశాన్ని మొదట అభివృద్ధి

చేయాలంటూ వేలాది బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐల (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి) కోసం అమెరికా, జపాన్, చైనా, రష్యా పెట్టుబడులకు పూర్తిగా ద్వారాలు తెరిచింది. ఎఫ్‌డిఐల ద్వారా జరిగేది సామ్రాజ్యవాదుల ప్రత్యక్ష లూటీయే అనేదాన్ని మరుగునపరిచేందుకు, ఎఫ్‌డిఐల పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు ఎఫ్‌డిఐ అనే సంక్షిప్త పేరుకు ప్రత్యామ్నాయంగా 'ఫస్ట్ డెవలప్ ఇండియా' అనే నగిషీ చెక్కిన పదబంధాన్ని ఇటీవల అది చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా' విజన్‌లో భాగంగా ప్రచారంలోకి తీసుకొచ్చింది. ఒక పక్క దేశంలోని 125 కోట్ల మంది జనాభా అత్యంత ప్రతిభాశీలమైందని చెబుతూ, మరో పక్క భారతదేశ అభివృద్ధికి విదేశీ పెట్టుబడులు తప్ప మరో మార్గం లేదనే ప్రచారం చేస్తోంది. ఇది భారతదేశ సార్వభౌమాధికారాన్ని, దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని అమ్మివేయడం తప్ప మరొకటి కాదు.

దీని ద్వారా మోడీ ప్రభుత్వం భారత పీడిత ప్రజల మౌలిక సమస్యలైన జల్, జంగల్, జమీన్, అధికారం, ఆత్మగౌరవం, హక్కులు, పేదరికం, నిరుద్యోగం, అధిక ధరలు, కరువు, వరదలు, పర్యావరణం సమస్య, మహిళలు, దళితులు, పీడిత జాతుల పీడన-అణచివేత మొదలైన వాటి నుండి ప్రజలను పక్కదారి పట్టిస్తూ సామ్రాజ్యవాదులకు, వారి దేశీయ దళారీ తొత్తులకు మౌలిక సౌకర్యాలు కల్పించి వారికి దేశాన్ని పూర్తిగా లూటీ చేసుకునే అవకాశాలు కల్పిస్తున్నది. భారత ప్రణాళికా సంఘానికి చరమగీతం పాడి దేశ భవిష్యత్తును పూర్తిగా కార్పొరేట్ ఘరానాల చేతుల్లోకి నెట్టివేస్తున్నది. మోడీ ప్రభుత్వం ఆమోదించిన బడ్జెట్ అది యుపిఏ-3 బడ్జెట్‌గా బహిర్గతమైంది. 500 స్మార్ట్ సిటీలు, బుల్లెట్ ట్రైన్‌ల పథకాల ద్వారా కార్పొరేట్ జగత్తుకు పందారం చేయడం తప్ప ప్రజలకు ఒరిగేది ఏమీ లేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పోలవరం బిల్లును ఆమోదించడం, సుప్రీంకోర్టు తీర్పుకు భిన్నంగా సర్దార్ సరోవర్ (నర్మదా) ప్రాజెక్టు ఎత్తును పెంచడం ద్వారా లక్షలాది ఆదివాసుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టింది. ధరలు మరింత ఆకాశానికి అంటాయి. రైలు చార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ఇందుకు ఆజ్యం పోశాయి. నల్లధనాన్ని వెలికి తీస్తామనే దాని వాగ్దానం నీటి మూటే అని రుజువు కావడానికి ఎంతో కాలం పట్టదు. ఇటీవల అది ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన 'ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన' ద్వారా పీడిత ప్రజలకు ప్రత్యేకించి ఎటువంటి ప్రయోజనం ఉండదు. మరో వైపు హిందూ సంఘ్ పరివార్ దేశంలో అనేక చోట్ల తమ హిందుత్వ ఎజెండాకు అనుగుణంగా మైనారిటీలపై, కశ్మీర్, ఈశాన్య ప్రాంతంలోని పీడిత జాతులపై, దళితులపై, మహిళలపై దాడులు పెరగడం, మోడీ ప్రభుత్వం విద్యను కాషీయకరించే పథకాలను అమలు చేయడం, సంస్కృత భాషకు జీవం పోయాలనే దాని ప్రయత్నాలు మొదలైన చర్యల వల్ల హిందూ సంఘ్ పరివార్, దాని మోడీ ప్రభుత్వ అసలు ఎజెండా ఏమిటో బహిర్గతమైంది. ఇది పెరుగుతున్న బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు దాడికి సంకేతం. మొత్తం మీద మోడీ ప్రభుత్వం తన వంద రోజుల పాలనలో కార్మిక-కర్షక, మధ్యతరగతి తదితర పీడిత వర్గాలు, సెక్షన్లకు వ్యతిరేకంగా అనేక విధానాలను, చర్యలను చేపడుతూ తన అసలు రూపాన్ని బయటపెట్టుకుంటున్నది. దీనికి వ్యతిరేకంగా ఇప్పటికే దేశవ్యాప్తంగా అనేక

చోట్ల ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులు అన్నీ విప్లవానికి, ప్రజాయుద్ధానికి అనుకూలమైనవే.

ప్రపంచవ్యాప్తంగా అనుకూలంగా ఉన్న విప్లవ పరిస్థితిని మనం సరిగ్గా వినియోగించుకోవడానికి పూనుకుందాం. ప్రపంచ సోషలిస్టు విప్లవం విజయానికై, అందులో భాగంగా భారతదేశ పీడిత ప్రజల విముక్తికై ధైర్యంగా కొట్లాడుతూ ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేద్దాం. పార్టీ, ప్రజాసైన్యం, ఐక్యసంఘటలను బలోపేతం చేద్దాం. ప్రజాపునాదిని పెంచుకుంటూ ప్రజాయుద్ధంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు కేంద్రీకరించి కృషి చేద్దాం. సామ్రాజ్యవాదుల, భారత దళారీ పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రజా ఆందోళనలను తీవ్రతరం చేద్దాం. వర్గ పోరాటాల్ని పెంపొందిస్తూ విముక్తి ప్రాంతాల స్థాపన లక్ష్యంగా నూతనంగా విస్తరిస్తున్న ప్రాంతాలను ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలుగా, గెరిల్లాజోన్లుగా; ఎర్ర ప్రతిఘటనా ప్రాంతాలను గెరిల్లాజోన్లుగా అభివృద్ధి చేద్దాం. గెరిల్లాజోన్లను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేద్దాం. భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవానికి గ్యారంటీ నిచ్చే విధంగా కార్మిక–కర్షక తదితర పీడిత ప్రజలను సాయుధం చేస్తూ ప్రజా విముక్తి గెరిల్లా సేనను ప్రజా విముక్తి సేనగా అభివృద్ధి చేద్దాం. ఇందుకోసం దేశంలోని కార్మికులు, కర్షకులు, మధ్యతరగతి, విద్యార్థులు, యువత, కళాకారులు, మేధావులు, మైనారిటీలు, మహిళలు, ఆదివాసులు, దళితులు, వెనుకబడిన సెక్షన్లు, ప్రజాస్వామికవాదులు, దేశభక్తులు ప్రజాయుద్ధంలో భాగం కావాల్సిందిగా సెంట్రల్ మిలటరీ కమీషన్, సిపిఐ (మావోయిస్టు) పిలుపు నిస్తోంది. సాహసంగా పోరాడుదాం! అంతిమ విజయం ప్రజలదే!

☆ పార్టీని బోల్షివీకరించే క్యాంపెయిన్‌ను విజయవంతం చేద్దాం! ప్రజాపునాదిని బలోపేతం చేద్దాం!

☆ పిఎల్‌జిఏను పిఎల్‌ఏగా అభివృద్ధి చేయడానికి పెద్ద సంఖ్యలో యువతను రిక్రూట్ చేయండి!

☆ ప్రజా అధికార అంగాలను నిర్మించేందుకు ప్రజలకు సహాయపడండి!

☆ పిఎల్‌జిఏను సాయుధం చేసేందుకు శత్రు ఆయుధాలను స్వాధీనం చేసుకోండి!

☆ ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయండి! ప్రజలపై బహుముఖ దాడి 'ఆపరేషన్ గ్రీన్ హంట్'ని ఓడించండి!

☆ ప్రజలతో మమేకంకండి! ప్రజలకు సేవ చేయండి!

☆ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వర్ధిల్లాలి!

**విప్లవాభినందనలతో,**

**సెంట్రల్ మిలటరీ కమీషన్,**

అక్టోబర్ 5, 2014 **సి.పి.ఐ. (మావోయిస్టు)**